| గత సంచిక తరువాయి | # కుబ్జ | రచన: వడ్డాది పాపయ్య |
| --- | --- | --- |

## తిరుగు పయనం ౧౨

'జాగర్తమ్మోయ్, నీళ్ళల్లోకి తొంగి చూస్తుం డావు' మొన్న మొన్న నెపుడో నీకళ్ళోపడుచుకి చూసి నట్టుంది, యీ పడవలోనే.

'కాని నేనుకాదుగా, గూనిదాన్ని, కురూపిని—యింకా ముసలినేమో.'

'అదేమ్మా, అల్లాంటారు—అదుగో పిల్లం గ్రోవిపాట మొదలైంది.'

'ఏం ? అంత వినతగ్గదా ?'

'సార్రి—యీ నీళ్ళపాటకి గడ్డకట్టెస్తయ్యో, మా చేతులు తెడ్లెయ్యవోగాని వుండివుండి పడవ పటుక్కు నాగిపోతుందా పాట మొదలైతే'

'ఆ వూదేదెవరూ ?'

'తెల్నే తెల్దా—అక్కడ్నించేగా వస్తూం డావు—మా నల్లనయ్యే'

## నీటిబుంగలమాట ౧౩

పడవ నడుస్తుంటే యేర్పడ్డ నీటిబుంగలు— 'కుబ్జ, కుబ్జ,—గూ—గూ—గూనీ—గూనీ'

'అయితే'

నీటిబుంగలు—నిన్నధికంగా ప్రేమిస్తున్నాను. అధికంగా—ంగా—గా—'

## నగరివాకిట ౧౪

'ఏయ్ గూనీ! ఆగు, నీపాడు మొహానికి రాచ నగరులో నేం పని? 'పనుంది. ఈ వజ్రాలు మీ రాజు కౌనవాలు చూపు—యిదుగో నీవు రక్తాంగి నెరుగుదువా ?'

'ఓ—బాగా—ఓసారి చక్కందని కళ్ళిప్పి చూస్తే యిదుగో నుదుట్ని పుచ్చ—గంధం చెక్కతో కొట్టింది'

'సరే వేగంపోయి చెప్పు—అది చచ్చిందిలే.'

'ఆ! అయింది శాస్తి—సరే వుండు.'

## రాజుముందర ౧౫

'కంసరాజా! అన్యాయంగా చచ్చింది నీ రక్తాంగి—దాని అంతరంగికురాల్ని'

'దానిమాటకేం ఆ సంగతి ముందే తెలుసు—వాడూ చచ్చాడా ?'

'అవసానంలో చెప్పింది, వాడు అమరుడట.'

'ఛీ! పాడుమొహమా—నీవూ చచ్చి దాంతో చెప్పు, ఆ విషపుదుస్తులు సరిగా వుపయోగించలేదని.'

'కాని ఆమె రాజసేవని మరిచిపోలేదు.'

'ఏమయినా దయ్యమై పీకుతుందా ?'

'కాదు తనపని నన్ను చేయమన్నది.'

'దూరంగా పో—గూనీ—కురూపి రక్కసీ—'

'దయ్యం సుందరంగా వుంటుందా మరి—యిదుగో పిశాచనృత్యం చేస్తున్నాను—కళ్ళారా చూడు—దెయ్యాలంటె నీకిష్టంగదూ—'

'ఎవర్రా అక్కడ—ఓసే మధూతీ—అదుగో, త్రాచుపాము—' కాదు—కృష్ణభూతం—కాదు భ్రమ'

మధూతి—ఏయ్ గూనీ—కుబ్జామణీ—అలాపో—ఆ గంధం అరగదియ్యి—ప్రభూ—మధువు పొయ్యనా—'

'పొయ్యి—నింపు—అదిగో నెమలిఫింఛముస్—యేదీ తే యియ్యి'

'మధూతి—యేది—యే మధువు-పొయ్యాలా, యివ్వాలా ?'

'పెదాలకందివ్వాలి-నీలోని మధువు మధూతీ-యేదీ దగ్గిరిగా, హ్హా—వున్న నాలుగురోజులయినా--అనుభవించేయాలి-యింకా-యింకాపొయ్యి నా కింకే ముంది—నివ్వూ—మధువూను 'అదుగో-భూ-త-ం.'

'ఇదుగో చందనం, రక్తాంగి రక్తంతో అరగదీశాను. కృష్ణసర్పం విషంకలిపాను.'

## అద్దంముందు ఆశ ౧౬

'బ్రతుకుమీద నీకింత తీపెందుకూ ? ఇన్నాళ్ళెందుకున్నావ్ ?'

అద్దంలోని ప్రతిబింబం 'చచ్చి యేమనుభవిస్తాను'

'బ్రతికుండి 'కుబ్జ' 'గూనీ', 'కురూపి' అనిపించుకుందికా వున్నావ్ ?'

ప్రతిబింబం—'అయినా నేనుంటాను' నిన్నధికంగా ప్రేమిస్తున్నాను—వస్తాను 'అన్న అతని మాటవల్ల' అతడికీ రూపసే బాగుందట--వస్తాడు-'

'ఎప్పుడో ? స్వాతివాన'

## మహాసమయం ౧౭

'అదుగో నీవే, వస్తున్నావ్—చూడగలుస్తున్నానా, ఆనందంగా గుండెలు పగిలిపోతున్నాయి-ఏ గున్న ఏనుగలా నడవగలదు, వస్తున్నావా యీ మధురాసరోవరానికి—యీ వీధుల్లో నడిచి నీ పాదాలు కందిపోతున్న వే యేదీ--యిదుగో చందనం—జాజిపువ్వాడి—కుంకుమ—యిదుగో వనమాల.'

'చాలు నిన్ను చూస్తూ ఓపికపట్టలేను కుబ్జా, యేదీ, లే—' 'జ్ఞాపకంవున్నానా ! ఇది రాచవీధి--పౌరులు.'

'నాకు నీ యెడల రాచవీధి, పౌరులూ, యింకేమీలేవు—యేవీ నీ చెక్కిళ్ళలా అందియ్యి'

'అభాగ్యను—నీమోవి అందుకునే భాగ్యం లేదు—పాదాలుమాత్రం కళ్ళకద్దుకుని ముద్దెట్టుకోగల గూనిదాన్ని. 'నీ నుదుటి కస్తూరి—నీ కెమ్మోవి తాంబూలరాగవర్ణమూ నా ముఖాన్ని అంటుకొనే భాగ్యంలేదు'

'ఉన్నది—యిదుగో—సరా?

'నేను మారిపోతున్నానా—నీ చేయూతతో స్వర్గానికి యెదిగి పొడవైపోతున్నానా ! నేనున్నానా—నిన్ను విడువను స్వామీ'

'చాలు, యింటికిపో,—మీ రాజుకి అస్తమ సమయం చూపించాలి—రాత్రికివస్తాను.'

## మాధుర్యము ౧౮

'ఏమిటీ అలా చూస్తున్నావు.'

'వచ్చావా! అదుగో చెరసాల పడగొడ్తున్నారు—యీ నగరంతా దీపాలు—మీదనో ఆకాశం—క్రింద మరో ఆకాశం—దీపావళి—అదిగో మధుర చుక్కల దీపాలు—'

'ఈ ఆకాశంలో చంద్రుడేడీ—?

'ఉన్నాడిక్కడే ఓ నక్షత్రంతో'

'ఎవరా నక్షత్రం—నేను చూపించనా ?'

'అద్దం తెస్తావంతేనా.'

'ఇదుగో—'రక్తాంగి'—కాదు 'నవనీత'—కాదు జగన్మోహినీ—

'వారంతా చనిపోయారు—నీ కిష్టమేగా—కుబ్జ—యిదే నాజన్మదినం, నా జీవితానికిదే దీపావళి—'

'తెల్లకలువ మొగ్గవంటి నీకీ కృష్ణవర్ణుడు తగునా ?'

'విద్యుల్లత యెక్కడ శోభిస్తున్నదీ మరి. నీలిమబ్బు నేకదూ. అలా నే నేనూ నీవూను.'

'ఇంతందం యిన్నాళ్ళేలా దాచుకున్నావూ--దీపావళికోసమా !